# కుక్కపిల్ల

**శ్రీ చిత్తరంజన్ దేవ్**

అమ్మ నిద్దర పోతోంది; నాన్న గురక పెడుతున్నారు. చౌకీదా కేక ఎక్కడా వినిపించడం లేదు. గదంతా కటిక చీకటి; నేనెవళ్ళకీ కనపడటం లేదు. వాళ్ళూ నా కెవళ్ళూ కనుపించటం లేదు. కాని నేను కళ్ళు తెరుచుకుని చూస్తూనే వున్నాను.

నెమ్మదిగా బయటికి ఉడాయించినే? అమ్మో! అమ్మవి పాము చెవులు; తలుపు తీస్తే మేలుకుని తగలనిస్తుంది. నా కేదో దయ్యం పట్టిందని గడబిడ పడుతుంది.

కుక్క పిల్లలు బయట తిరుగుతున్నయ్. అవి రాత్రి తెల్లవార్లూ బయటే తిరుగుతూ వుంటయ్. నక్కలు వాటికోసం గోరాడుతున్నయ్. టామీ నక్కల్ని తరిమితరిమి తిరిగొచ్చి ఆయాసపడుతోంది. దాని అలుపు నాకు వినిపిస్తూనే వుంది. పిచ్చిముండ! అది నక్కల్ని పట్టుకోలేదు. నక్కలు బలే జిత్తులమారివి. అవి ఎప్పుడూ ఒంటినే రావు. ఒకటి వచ్చి ఏ గోడమూలనో దొంగతనంగా నక్కి కూర్చుంటుంది. మరొకటి టామీ ముందుకొచ్చి కవ్విస్తుంది. పిచ్చిముండ టామీ దానివెంటబడి తరుముకుంటూ పోతుంది. ఈ లోగా గోడమూలున్న రెండో నక్క వచ్చి ఒక కుక్కపిల్లను నోట కరుచుకుని ఉడాయించేస్తుంది. ఇలా ఇప్పటికే మూడు పిల్లల్ని తినేసినై.

ఇది ఆలోచించిన కొద్దీ నాకు గాబరాగావుంది: అమ్మను లేపాను.

'కుక్కపిల్లల్ని గదిలోకి రానిద్దామమ్మా!—'

అమ్మ కోపంగా నవ్వింది—'వెధవ జంజాటం, ఇవాళ్ళో రేపో వాటిని ఆ పూరచెరువు కాడ పారేయించి పీడా విరగడ జేయిస్తాను'

చూశారా! అమ్మ యేవంటోందో. పూరచెరువంటే యేవిటనుకున్నారు? పూరవతల పెద్ద చెరువు; చెరువంతా యెండిపోయి మధ్య నెక్కడో కాసిని నీళ్లుంటాయి. ఊళ్లో చచ్చిన వాళ్లందర్నీ తగలెయ్యడం, పాతెయ్యడం ఆ చెర్లోనే. చచ్చిన గొడ్లని కూడా అక్కడే కోస్తారు. ఆ చెరువు నానుకునే పెద్ద అడివి. వాటి దుంపతెగా ఆ అడవినిండా కావలసినన్ని నక్కలు.

అమ్మ ఇంకా ఏవంటుందంటే;

'ఆ కుక్కపిల్లలు రోజురోజుకీ పెద్దవై పోతున్నయ్. వాటికి కాస్త బొమికముదిరితే, ఇక నక్కలు కూడా వాటి జోలికిరావు. ఆ కుక్కల నన్నిటినీ యింటినిండా పెట్టుకు కూర్చుంటానా యేవిటి? వాటి కన్నిటికి తిండి యెక్కడనుంచి తెస్తావ్?'

నక్కలకైతే కుక్కపిల్లల్ని తింటుంటే కమ్మగానే వుంటుందనుకోండి; కాని పాపం టామీ ఎంత ఏడుస్తుంది. తను కూడా బిడ్డల్ని కన్నతల్లేకదా, అమ్మ అలా అనొచ్చా?—'

ఇంకా చాలా పొద్దుపోయింది. నాకు కంటిమీద కునుకులేదు. ఊళ్లో గస్తీతిరుగుతున్న చౌకీదారు కేకలు మధ్యమధ్య వినిపిస్తున్నాయి. తెల్లగా తెల్లారిపోయింది. ఉషారేఖలు గది కిటికీలోంచి లోపలికి పడుతున్నయ్. ఇరుగు ఇళ్లల్లో నుంచి బాతులు కిచకిచ లాడుతూ బెలబెలా బయటికి వస్తున్నయ్. సూర్యకిరణాలు పడి నావళ్లూ మనస్సూ కూడా వెచ్చబడుతోంది. అమ్మ కేకలు పెడుతోంది:

'ఒరే! శాంతీ! లే! వాటి నన్నిటినీ గోనెలో కుక్కాను—ఒకటే రొదచేస్తున్నయ్. పోయి, పీడా విరగడచేసిరా!—'

'అబ్బ! ఇప్పుడు వాటి కంత తొందరేవిటి?—నక్కలు ఎల్లాగూ అడివిలోకి వెళ్లిపోయాయాయిరి. ప్రొద్దుగూకేదాకా అవి మళ్ళా తిరిగొస్తాయా పెడతాయా? పట్టపగలు తీసికెళ్ళి పారేస్తే యేం లాభం అవి మళ్ళా ఎలాగు నెమ్మదిగా పారాడుతూ తిరిగి వస్తయ్. టామీ వెళ్లి వెంటబెట్టుకురాదూ?—'

'వెధవ నక్కలే కావాలట్రా; వాటిని చెరువు గట్టున ఎవడేనా చూసి, మోజుపడి యింటికి తీసుకెళ్ళి పెంచుకోగూడదూ?'

---

ప్రపంచ కథానికల రెండవ పోటీకి అనుబంధంగా జరిగిన వంగభాషపోటీలో ప్రథమ బహుమతి పొందినకథ.

'పోదూ! ఇప్పుడు వాటి సంగ తెవడు చూస్తారూ! కాస్తేమన్నా చదువుకోవాలా అక్కర్లేదా. హోమ్‌వర్కు చేసుకు రాకపోతే మేష్టారు తంతారు, తెలుసా? బళ్లోనుంచి తిరిగొచ్చిం తరవాత సాయంత్రం తీసుకెడతాలే.'

అమ్మ అంతా విన్నది. ఏవీ! మాట్లాడలేదు గాని బలే కోపమొచ్చినట్టుంది. స్నానం చెయ్యటానికి చెరువుకు బయలుదేరింది. వెళ్లేటప్పుడు అమ్మ కళ్ళ వంక చూశాను. నా గుండె గబగబా కొట్టుకుంది. అమ్మ రేవుమెట్లమీద బిందె పెట్టడం నా గదిలోకి వినిపించింది. మట్టి కుండయితే నూరు చెక్కలై వుండును. ఎంతకోపం!

నెమ్మదిగా కుక్కపిల్లల దగ్గిర కెళ్లాను. అక్కాయిలూ, చెల్లాయిలూ అన్నీ కలిసి ఒకదాన్నొకటి తోసుకుంటూ వాళ్లమ్మ దగ్గర పాలు దాగుతున్నయ్. తల్లిప్రేమతో టామీ హృదయం నిండిపోయింది. మాగన్నుగా పడుకుని విశ్రాంతి తీసుకుంటోంది.

పక్క నెవ్వరో వచ్చి కూర్చున్నట్టనిపించి కన్ను విప్పి నావంక చూసింది. మా అమ్మ ఒకొక్కప్పుడు నావంక అలానే చూచేది.

కుక్కపిల్లలు పూర చేరువు పాలుగాలేదు. నాకు తలనొప్పి వచ్చి రెండు రోజులు అలానే ఉండిపోయింది. మూడోనాడు కడుపులో నొప్పివచ్చి పక్కమీద పడుకుని పొద్దుటినుంచి సాయంత్రందాకా అలా దొర్లుతూనే వున్నాను. తరువాత నరాల తీపూ అదీ పట్టుకుంది, మరో మూడు రోజులు. తరువాత ఇలాగే మరో జబ్బూ మరో బాధా!

అమ్మకు కంగారెత్తిపోయింది. ఇంట్లోవున్న దేవుళ్ళ ముందర కూర్చుని ప్రొద్దస్తమానం ప్రార్థనలు చేస్తోంది. ఓ! పూజలమీద పూజలు! ఉండుండి నా మంచం దగ్గిరికి పరుగెత్తుకొచ్చి చూసి పోతోంది.

రోజుకు మూడుసార్లు స్నానం చేస్తోంది. మెడకు చీర చెంగు ముడేసుకుని దేవుడి పాదాలమీద తలవేసి బాదుకుంటోంది. ఇదంతా పక్కమీద పడుకుని దొంగతనంగా చూస్తూనే వున్నాను.

అమ్మ పెదవులు మాటమాటకూ నా చెక్కిలిని స్పృశించుతున్నాయి. నాకు చికాకుగా వుంది. లేచి బయటికి వెళ్ళిపోవాలనిపిస్తోంది. అమ్మ నన్ను రెండు చేతుల్లోనూ గట్టిగా అలుముకొని లేవనీయటం లేదు. అమ్మ మాట్లాడుతోంది. ఆవిడ హృదయం వణికిపోతున్నట్టే మాటలు కూడా వణికిపోతున్నయ్.

'మా నాయన గాదు—అల్లా లేవకు—మా తండ్రి గాదు—నీకు చాలా జబ్బుగా వుంది.

లోలోపల నవ్వుకుంటున్నాను—నువ్వనుకుంటున్నంత అమాయకపు పసిబిడ్డను కాదమ్మా అనుకుని. కాని రోజుల తరబడి, గోదుమ జావ, బార్లీ నీళ్లూ, కొబ్బరి నీళ్లూ ఈ వగైరా దరిద్రపుగొట్టు తిండితో బతకటమంటే తలప్రాణం తోకకొస్తోంది. కడుపులో పేగులు దహించుకు పోతున్నయ్. ఆరోగ్యంగా వున్నవాణ్ణి అనవసరంగా ఆ మందులు మింగటమంటే ప్రాణంమీద కొచ్చినట్టుంటోంది.

కుక్కపిల్లలు నానాటికి అల్లరి నేర్చుకుంటున్నయ్. ఇరుగుపొరుగు ఇళ్లన్నీ తిరిగివస్తయ్ వంట గదుల్లోకి కూడా జొరబడుతున్నయ్. వాళ్లంతా కర్రలట్టుకు వెంటబడుతున్నారు. ఉండుండి గోలగా అరుస్తూ నా పక్క చుట్టూ చుట్టేస్తున్నయ్.

'వెధవ కుక్కలు! అవతలకి తరమరాదుట్రా?' వాటి బాధ భరించలేక అమ్మకు కళ్లనీళ్ళు పర్యంత మౌతోంది.

అవి నానాటికి మరీ పేట్రేగిపోతున్నయ్. ప్రతి వాళ్లనీ స్వంత మనుషులుగా పరిగణించి వ్యవహరించుకున్నయ్.

ఎన్నిసార్లు తరిమినా సరే మళ్ళీ మళ్ళీ వాళ్ళ యిళ్లకే పోతూవుండటం! వాళ్లు అమాంతం చెవి పుచ్చుకుని పైకెత్తి కచ్చకొద్దీ విసిరి అవతల పారేస్తున్నారు. నా మనసులో ఎంతో బాధగా వుంది. కాని నేనేమి చెయ్యనూ?—వాళ్లు నేను వద్దంటే మానతారా?

హిందువుల యింట్లోకి కుక్క దూరటమంటే యేమిటీ? కొంప లంటుకున్నాయన్నమాటగాని మరేమన్నానా? వంటయింట్లో వున్న కుండ లన్నీ పగలగొట్టి అవతల పారవేస్తారు.

ఇంకా శ్రోత్రియకుటుంబాలైతే, పురోహితుణ్ణి పిలిపించి, పుణ్యాహవాచనాది తతంగమంతా జరిపిస్తారు.

అవి అలా పెరుగుతున్నకొద్దీ అల్లకల్లోలంగా ఉంది. టామీకి పాలెండిపోయాయి. అయినా అది కనుపించితే చాలు మీదబడి, పట్టి తిత్తులనే పీకుతున్నాయి. టామీ తప్పించుకు తిరగడానికి రోజంతా తంటాలు పడుతోంది. ఇవి దానికోసం ఊరూ నాడూ గాలిస్తున్నయ్.

టామీ కూడా అందరి వంట యిళ్ళల్లోకీ జొరబడుతోంది. ఏది నోటికందితే అదల్లా మెక్కేసి పెదవులు నాక్కుంటూ దర్జాగా బయటికి వస్తోంది.

శిశిర ఋతువు; ప్రొద్దుకూకబోతోంది. కొంచం చలిచలిగా వుంది. నేను వరండాలో కూర్చున్నాను. ఒంటినిండా దుప్పటి కప్పుకుని ఒక బుట్ట చేతబట్టుకుని, మా పొరుగింటివాళ్ళ అబ్బాయి, నా టామ్ వచ్చాడు. ఎందు కొచ్చావని అడిగాను.

## కుక్క పిల్ల

అమ్మ వాణ్ణి ఉత్తర వేపు దరవాజా దగ్గిరికి పిలిచింది. నేను ఆదుర్దాగా వాళ్లవంక చూస్తున్నాను.

వాడు కుక్కపిల్లల నన్నిట్నీ బుట్టలోకి ఎత్తుకున్నాడు. ఒకదాన్ని లోపలబెడితే రెండోది లోపల నుంచి తెయ్యిమంటూ బయటికి దూకుతోంది. నానా తంటాలూ పడి వాటి నన్నిటినీ గంపలో బెట్టి గోనె మూతేశాడు. టామీ ఎక్కణ్ణుంచో దూకింది. నాటాయ్ వంక తీవ్రంగా చూచింది. బుట్టలో నుంచి 'కుయ్ కుయ్' మని వినిపించుతోంది.

వంటయింటి గుమ్మంలో నుంచి అమ్మ కేక: 'టా...మీ...'

టామీ గజిబిజిపడి పోయింది. కంగారుగా బుట్ట వంక చూసింది. మళ్లా అమ్మ కేక వినిపించిన వైపు ఆదుర్దాగా చూసింది. దాని గొంతులో ఏదో కళవళముగా ధ్వని. బుట్టవంక చూస్తే దాని గుండెలు దబదబా కొట్టుకుంటున్నయ్—కేక వినిపించిన దెసచూస్తే నాలుక వెంట నీళ్లు కారుతున్నయ్.

మోసంలో పడిపోయింది. నాలుగు కాళ్ల మీద ఎగిరి అమాంతం పరుగెత్తింది. సందు దొరికిందే చాలునని నాటాయ్, బుట్ట నెత్తినెట్టుకుని కాలికొద్దీ పరుగెత్తాడు. నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తూరుపురేఖలు పొడుస్తున్నయ్. మంచుముసుగును చీల్చుకుని మసీదులోనుంచి కేక వినిపిస్తోంది. దూరాన సాయిబులవీధిలో కాకు లరుస్తున్నయ్. బాతులు బెలబెల లాడుతున్నయ్.

దుప్పటి కప్పుకుని నెమ్మదిగా బయలుదేరాను. నాకు జబ్బుగావుందనే ఇంకా అమ్మ అనుకోవటం. కాని నా మనసులో వున్న మాటమాత్రం నే నెవ్వరికీ చెప్పలేదు.

మాయింటిప్రక్కనున్న మైదానానికి అడ్డంపడి మట్టిరోడ్డెక్కాను. రోడ్డు వెంట నేపడి తూరుపుగా పోతున్నాను.

రోడ్డు చాలాచోట్ల గళ్లుపడి వుంది. వాటిమీద తాటిదూలాలు పరిచారు. వాటిమీదనుంచి దాటి వెళ్లాను.

రోడ్డుకు ఎడమపక్క సులాబీ. కుడిపక్క వూరచెరువు. రోడ్డుక్రింది తూముల్లోనుంచి మురికినీరు ప్రవహిస్తోంది. తల పైకెత్తి చుట్టూతా చూశాను. ఒక్కసారి గుండె గభీలుమంది.

ఆ ప్రదేశమంతా కీచుమంటూ నిర్మానుష్యంగా వుంది. చూపుమేర దూరంలో ఎక్కడా నరసంచారం లేదు.

మధ్యలో జడలు విరబోసుకున్న దెయ్యంలా ఒక పెద్ద రావిచెట్టు. ఆ చెట్టుచుట్టూ గోరీదిబ్బలు. చచ్చిపోయిన అనేకమంది పసిపిల్లలు ఆ దిబ్బలక్రింద పెద్దనిద్దురపోతున్నారు. దిబ్బలమీద బిళ్లగన్నేరు మొక్కలుపూసివున్నయ్. ఆ పువ్వులమీద ఎందరు తలిదండ్రుల కన్నీరు బలికిపోయిందో.

భూమి మీద అనేకమంది మనుష్యులు—గోరీల క్రింద అనేకమంది.

కుక్కపిల్లలు మాత్రం ఏమయారో కనుపించటం లేదు

చూపు మేర దూరంలో ఎవ్వరూ కనుపించటం లేదు. నా గుండెలు మరింత వేగంగా కొట్టుకుంటున్నయ్. నా శరీర మంతా చలి గుబుల్లాంటి భయమేదో ఆవరించింది.

ఉన్నట్టుండి ఏదో ధ్వని! ఆ ధ్వని ఏమిటో ఎక్కడనుంచి వస్తోందో తెలియలేదు. తూర్పున సూర్యుడు మాత్రం ఉదయిస్తున్నాడు.

పట్టపగలుగా తెల్లవారిపోయినా ఇంకా నాకు చీకట్లో తిరుగుతున్నట్టుగానే వుంది. నా తలమీది వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నయ్. గుండెల్లో ఏదో గుబులుగుబులుగా వుంది. ఒళ్ళంతా ఎదో పాకుతున్నట్లనిపించింది. తిరిగి మళ్లీ అదేధ్వని! వెనకా ముందూ చూసుకున్నా ఎక్కడా ఏమీ కనిపించలేదు. గుప్పున, దెయ్యాలసంగతి జ్ఞాపకం వచ్చింది. మనం యెవళ్లకోసం వెతుకుతున్నామో వాళ్లగొంతు పెట్టుకుని దెయ్యాలు మన్ని పిలుస్తాయనీ మాట్లాడతాయని మోసంచేసి యెత్తుకుపోతాయనీ అనేక కథలు విన్నాను.

నాకళ్లు భైర్లు క్రమ్మాయి; కట్టెదుట మనిషి నిల్చున్నా కనిపించనిస్థితి యేర్పడ్డది.

ఆ ధ్వని మరింత తీవ్రంగా వినిపించుతోంది. కాలవక్రింది తూములవేపు నడిచాను. బ్రిడ్జిక్రింద మోకాటితండా వేసి కూచుని చీకటిగావున్న ఒక తూములోకి తొంగిచూస్తున్నాను. ఒక జంతువేదో ఆ తూములోనుంచి రివ్వున బయటికివచ్చి నన్ను పడదోసేసింది. గుప్పున ఏదో పాడువాసన!

లేచి నిల్చున్నాను. నా పంచా, దుప్పటికూడా బురద గొట్టుకున్నయ్. చుట్టూ చూశాను; ఎవ్వరూ కనుపించలేదు.

బురద మరకలు కడుక్కోవటానికి నీళ్ళవద్దుకు వెళ్లాను. నీళ్లలో ఏవో చిన్నిచిన్ని తరంగాలు లేస్తున్నయ్! 'ఏమిటవి? చేపలేమో. చేపలు ఈదితే మాత్రం అంతంత పెద్దపెద్దతరంగాలు కడతాయా. కొంచెం ముందుకువంగి తొంగిచూశాను.

జీవన మరణసంధ్యలో బాధగా ఏడుస్తున్న రెండుముఖాలు! మునిగిపోకుండావుండటానికి రాత్రి తెల్లవార్లూ అట్టాగే కొట్టుకుంటూవున్నయ్ కాబోలు. అవి అలా శక్తి నంతా వినియోగించటానికి ప్రయ

త్నించటంలో ఇంతింతగా ముడుచుకుపోయి కనుపించుతున్నాయి.

నీళ్ళలోకి మునిగాను — నీళ్లు జివ్వుమంటూ చలి ఇగంలా వున్నయ్. రెండు కుక్కపిల్లలనూ రెండుచేతులా బట్టుకుని బయటికి వచ్చాను. వాటిని గుండెలకు హత్తుకున్నాను.

గడ్డివున్న ప్రదేశమంతా తడితడిగా వుంది. మనుషులు నడిచి గడ్డి చచ్చిపోయిన కాలిబాటలో వాటిని తెచ్చిపెట్టాను. చలికి గజగజా వణుకుతూ కుయ్యో కుయ్యో మని యేడుస్తున్నయ్. గుడ్డలు పిండుకుని త్వరగా ఆరాలని గాలికి అడ్డుపట్టుతున్నాను.

ఒక రాబందు రివ్వున ఎగిరివచ్చింది; కుక్కపిల్లఅరుపు గాలిలో వినిపించింది — నెమ్మదిగా ఆకాశంలో అంతరించిపోయింది. ఏమీ చేయలేక దేబెముఖం వేసుకుని చూస్తూ నిల్చున్నాను.

కన్నీరు చెక్కిళ్ళమీదుగా ప్రవహించుతోంది. మిగిలిన ఒక్కపిల్లనీ దుప్పటిక్రింద దాచుకుని ఇంటికి బయలుదేరాను.

అది యింకా యేడుస్తూనే వుంది. రాత్రి తెల్లవార్లూ నీళ్ళల్లో నానింది, చస్తుందో బ్రతుకుతుందో.

మా యింటి ప్రక్కనుంచే ఒక కాలవ ప్రవహించుతూ వుంది. కాలవొడ్డునవున్న గంగరావిచెట్టు మొదటవున్న తొర్రలో కుక్కపిల్లను వుంచాను

దాని ఏడుపు విని, టామీ ఎక్కడనుంచో రయ్యిన పరుగెత్తుకొచ్చింది. సంతోషంతో తోక అల్లలాడిస్తూ నేలమీద వెల్లకిలా పడుకుంది. కుక్కపిల్లని దాని పొదుగుదగ్గిర వదిలేసి అవతలకి పోయాను.

అమ్మ కేకలేస్తోందేమో నని భయమేసి చెవులు రిక్కించి విన్నాను. చిత్రమే! ఎక్కడా కేకలు వినిపించటం లేదు. అమ్మకు బాగా కోపం వచ్చి వుంటుంది. కొడుతుందేమోనన్న భయంతో చాలాసేపు ఆ చెట్టుక్రిందనే వణుకుతూ నిల్చున్నాను.

కొన్నాళ్లు గడిచింది. టామీకి, ఎనిమిది పిల్లలకు, మిగిలిందల్లా ఈ ఒక్కపిల్ల. దాని పొదుగు నిండా పాలు. చిన్నముండ అవన్నీ తాగలేకపోతోంది.

టామీ నల్లగా వుంటుంది. ఇది మాత్రం పాల నురుగులా తెల్లగావుంటుంది. చూస్తే ముచ్చటేస్తుంది.

కుక్కపిల్ల ఆడుకోడానికి, అమ్మ రంగురంగుల గుడ్డపీలికలతో బంతులు కుట్టింది. వాటితో సర్దాగా ఆడుతూ అది యెప్పుడూ వంటయింటి ముందు వరండాలోనే అమ్మ కాళ్లచుట్టూ తిరుగుతూ వుంటోంది.

ఒకనాడు దానికి హుషారు పుట్టింది. అమ్మ వరండాలో పోగుబెట్టుకున్న చితుకులన్నీ చెల్లాచెదరుగా చిమ్మింది. దానికి అదో సర్దా! అమ్మకు వళ్లు మండింది. ఒక తుంటె పుల్ల పుచ్చుకు వీపుమీద ఒక్కటే వేసింది. అది 'కుయ్యో!' మని అరిచిందేగాని అక్కణ్ణుంచి మాత్రం పోలేదు. అమ్మ పాదాల మీద బడి ఇటూ అటూ దొర్లింది. అమ్మ నన్ను కేకేసి 'చూడరా ఇదీ! కొట్టినా అవతలికి పోదూ!'

'అవును అస్తమానం దాని కేదో మేపుతూ వుంటావాయిరి. పొమ్మంటే పోతుందా మరి!

ఆ నాటినుంచీ దాన్నికట్టేసి సాయంత్రంపూట మాత్రం కాసేపు వదుల్తూవున్నాం.

ఒకనాడు మధ్యాహ్నం పడుకుని నిద్రపోతున్నాను. నేను నిద్రలేచి చూసుకుంటే పక్కలో కుక్కపిల్ల లేదు. నిద్రపోయే ముందు దానితో కాసేపు ఆడుకుని పక్కలో బెట్టుకు నిద్రపోయాను. అది ఎప్పుడు లేచి పారిపోయిందో పారిపోయింది. అమ్మనడిగాను; చూళ్ళేదంది.

వెతకటానికి బయలుదేరాను. ఇల్లిల్లూ వెతికి విసుగెత్తిపోయింది. అది ఇల్లు వదిలిపోవటానికి బజారుకుక్క గాదే! ఎవరో కావాలని యెత్తుకుపోయి వుండాలి. అది అందంగా వుండటం చూసి ప్రతివాళ్లూ దానిమీదే కన్ను వేశారు. ఇంతకీ ఎవరెత్తుకు పోయి వుంటారు?

చప్పున జ్ఞాపకం వచ్చింది; పాట్లీ తల్లి నిన్న గోలచేసింది — వండుకున్న చేపల కూరంతా తినేసిందని. నిన్న ఆ మాటలు మేమెవ్వళ్ళం నమ్మలేదు. ఒకవేళ నిజంగా తినేసిందేమో. నేను పాట్లీ యింటివేపు బయలుదేరాను.

ఆవిడవంటయింటికి ఒక అదుపంటూ లేదు. వాన కురవకుండా, కప్పుమీద గోనెచింపులు వగైరా కప్పివున్నయ్. బయటినుంచి చూస్తే పైనున్న వాసం నుంచి వేళ్ళాడుతున్న వుట్టిమీది మసిమంత కనుపించదు. ఉట్టి చేర్లు కూడా నల్లగా బూజేసివున్నయ్. ఆ వుట్టి కూడా చాలా ఎత్తునుంది. అది కుక్కపిల్లకెలా అందుతుంది? అంతెత్తు ఎగిరిందంటే అది ఆలోచించాలిసిన విషయం.

ఆయింటిచుట్టూ బురదబురదగా వుంది. ఎక్కడబడితే అక్కడ చేపపొలుసులూ, బొమికెలూ, నానా గలీజూ. చెడువాసన వేస్తోంది. ముక్కుకు చెయ్యి అడ్డుపెట్టుకున్నాను. ఊడిచిన పెంట పోగంతా అక్కడ ఎన్నియుగాలనుంచో గుట్టగా పోసివుంది. వట్టి మురికిగొడ్లు! వాళ్ల జీవితాల్లో ఎప్పుడూ ఇల్లు కడుక్కోవటం అంటూవుండదు

పాట్లీతల్లి బొబ్బపెట్టింది:

'ఓహోయ్! చోటాబాబూ! మా పెంటపోగు కుప్పలమధ్య అక్కడేంజేస్తున్నావూ?' —

'మా కుక్కపిల్ల కనుపించిందా?' —

చోర్ దా పెద్దపెద్ద అంగలేసుకుంటూ వచ్చి నా చెయ్యిబట్టుకున్నాడు. అతను పైర్లు తిరిగిన వస్తాదు. నన్ను అమాంతం గాలిలోకి ఎత్తి దబాల్న నేలకేసి కొట్టాడు! —'

'అలా కాదు — ఆ మెయిని తీసుకుపోయి ఆ చెర్లో ముంచెయ్యి వెధవని'—అమ్మ కేకలు. 'కుక్క పిల్లట. పోగు కుప్పల్లో వెతుకుతున్నాడు. నా కడుపు చెడబుట్టాడు. వాడిమూలాన నా బ్రతుకంతా నరకమైపోతోంది.'

చోర్ దా మండిపోతున్నాడు: నన్ను వెక్కిరిస్తూ:

'ఏరా! బుల్లాడా? మెడకి గొలుసు తగిలిస్తే దాని మెడ కందుతుందిగా' — వెళ్ళి వెతుక్కు తెచ్చుకో—గొలుసు విప్పినందుకు ప్రాయశ్చిత్తం.'

నేను నేలను తాంబేలులా కరుచుకుని అలానే బోర్లబొక్కలుగా పడున్నాను. నన్ను చెర్లో ముంచాలంటే, బలవంతాన నేలనుంచి ఊడబీకాలిసిందే!

అమ్మ చింతమెల్లె పుచ్చుకొచ్చింది. నావీపు హూనమైపోయింది. కాళ్లూ చేతులూ పారజాపేసి చచ్చినవాడిలా పడున్నాను. అమ్మ గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది. మళ్ళీ రెండుక్షణాలకు తిరిగివచ్చి నాప్రక్కనే కూలబడి, తానుకూడా ఏడవటం మొదలుపెట్టింది. నన్ను తనఒళ్లోకి తీసుకోవటానికి ప్రయత్నించింది. నాకు పెద్దపెట్టున ఏడుపు ముంచుకొచ్చేసింది. గుబులు గుబులుగా ఏడి చేస్తున్నాను.

ఇంతలోనే నాన్న పాదాలచప్పుడు దూరాన వినిపించింది. అమ్మ కంగారుగాలేచి చెరువుకు వెళ్ళిపోయింది. నేను నోరుమూసుకుని పిల్లిలా గదిలో దూరేశాను.

స్నానంచేసివచ్చి అమ్మ నన్ను రహస్యంగా పిల్చింది. నానెత్తి నిన్ని తులిసి నీళ్లు చల్లింది. ఒక తులిసాకు నానోట్లో కూరింది.

అసాయంత్రం: 'హరిహరీనారాయణా' అంటూ ఒకవైష్ణవస్త్రీ బిచ్చాని కొచ్చింది. ఆమె ఎవరివస్తువు లేంపోయినా — ఆవులు పోయినా, సొమ్ములు పోయినా — ప్రశ్న చెబుతుంది. చేతిలోవున్న కర్రతో అమాంతం నేలమీద వ్రాసేస్తుంది.

'నా కుక్కపిల్లెక్కడుందో చెబుతావ్?—'

'ఓ! చెప్పేస్తా! — ఒక అయిదణాల కానీ తీసుకురా—ఇప్పుడే చెప్పేస్తా!

'తిరువాతిస్తాలే—ముందు చెప్పు'—

'నీకు తెలీదు తండ్రీ! డబ్బులు బిరిలో పెట్టి మంత్రం చెబితేగాని, తల్లి పలకదు'—

అమ్మ నిద్రపోతోంది — లేపితే గూబ కదలేస్తుంది. మెంతులుడబ్బీ లవీ వెతికాను. ఎక్కడా ఏమీ కనుపించలేదు. అమ్మ చీరకొంగున తాళం చెవుల గుత్తి వ్రేలాడుతోంది. వణుకుతున్న చేతులతో నెమ్మదిగా విప్పదీశాను.

పెట్టె తాళం తీశాను. అందులో నాలుగణాలే వున్నయ్. మిగతా అయిదు కానులూ దొరకలేదు. అంతవరకే తీసుకుపోయి వైష్ణవ యోగిని కిచ్చాను. తాంబూలం కూడా కావాలి తెమ్మంది. ఇంట్లో వక్కలాకులు ఎక్కడ వుంటాయో నాకు తెలుసు. తెచ్చి యిచ్చాను.

"అది యెక్కడికీ పోలేదు—ఇంట్లోనే వుంది. పోయి వూకబస్తాలగడమూంచిక్రింద చూడు అంది.

ఆమాటలు ఇంకా పూర్తిగాకపూర్వమే, ఒక్క ఉదుటున పాకలోకి పరుగెత్తి గడమూంచి క్రింద వెతికాను. ఎక్కడా ఏమీ కనుపించలేదు. భగ్నహృదయంతో తిరిగి వచ్చాను. నేను వచ్చేలోపుగానే ఆయోగిని, గాలిలోకి గావల్ను, అదృశ్యమైపోయింది.

నేను బడి మానేసి అప్పటి కెన్నోరోజులైంది. తిరిగి బళ్లోకెళ్లాను. పిల్లవాళ్లంతా నన్నేదో కొత్త వాణ్ని చూసినట్టు అదోలా చూస్తున్నారు. మాస్టారు మీసంకొసను పంటితో కొరుక్కుంటూ:

'ఏరా! అబ్బీ! ఏమిటీ మనసంగతి! రాతా కోతా నేర్చుకోవటమా — కుక్కపిల్లతో, జీవితం వెళ్లతీసుకోవడమా?'

నేను సమాధానమేమీ చెప్పకుండా తల వంచుకున్నాను.

'అయితే నీకు ఒక మహత్తరమైనగీతం బోధించవలసివుంది' అన్నారు మాస్టారు.

తేనెతుట్టెమీద బెడ్డ విసిరినట్టయింది. పిల్లలంతా ఒక్కసారి 'జాం'మని ఎత్తుకున్నారు.

'అనగా అనగా కుర్రాడు
కుక్కలపిచ్చి కుర్రాడు!
కుక్కపిల్లకై చక్కనదూకీ
మురికికుంటలో మునిగాడు'—

'వహ్వా! అది చేపైనా బాగుండును'—అంటూ మాస్టారు పగలబడి నవ్వుతున్నాడు. నాకు చిరాకెత్తిపోయింది. బళ్లోనుంచి బయటికి పారిపోయాను.

బహుశా నాన్నకు ఇది తెలిసిందికాబోలు. ఆయన కళ్లు చింతనిప్పుల్లా వున్నయ్. కాని ఆయన ఇదేమీ కదిలించలేదు.

ఆవేళ మాఘపూర్ణిమ సంత. ప్రొద్దుట్నుంచీ డోళ్లు వినిపించుతూనే వున్నయ్. సంతకెళ్లటానికి నేనూ సన్నాహమవుతున్నాను. నాన్ననీ, అమ్మనీ

అడిగి చిల్లరడబ్బులు పోగుచేశాను. ఆడా మగా, జనం ముచ్చట్లాడుకుంటూ రోడ్డువెంట పోతున్నారు.

ఇంతలో నాటాయ్ పరుగెత్తుకొచ్చాడు. ఆ ఆయాసంలో వాడికి సరిగా మాటే రావటంలేదు.

'శాంతీ! నీ కుక్కపిల్ల!—వాడెవడో సంతలో అమ్మెయ్యటానికి పట్టుకుపోతున్నాడు.

నా నాళాలలో వున్న రక్తం యావత్తూ ఒక్కసారి పొంగింది. ఎవడు, ఎవడా బద్మాష్!

ఆమాట చెప్పీ చెప్పటమే నాటాయ్ రివ్వున మళ్లీ ఎటో ఉడాయించేశాడు. ఎటు పోయాడో! నేను అదంతా వెతికాను. ఎవళ్ళూ కనిపించలేదు.

వాడు మళ్ళీ పరుగెత్తుకొచ్చాడు:

'రా! రా! చోర్‌దా వాణ్ణి పట్టుకున్నాడు. ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు చావగొట్టుకుంటున్నారు?'— మళ్ళీ పరుగెట్టేశాడు.

నాకు బలే కంగారెత్తి పోయింది. అయినా బయలుదేరాను. నాటాయ్ మళ్ళీ నాకు ఎదురొచ్చాడు. వాడి చేతిలో, మెళ్ళో ఒక తాడుతో కుక్కపిల్లవుంది. అమాంతంపోయి వాడి చేతిలోవున్న తాడు లాక్కున్నాను. వెంటనే తీసుకుపోయి వంటయింటి వరండాలో వున్న గుంజకు కట్టేసి బయటికి వచ్చాను.

చోర్‌దా ఆ దొంగవెధవను మా యింటిముందుకు పడ లాక్కొచ్చాడు. వాడికి ఇంత పెద్ద జీబు తల— చేతిలో ఒక వేణువు కూడా వుంది. వస్తాదుల మల్లే ఇంతింత బుర్రమీసాలు. చోర్‌దా కంటే చాలా బలంగా వున్నాడు. చోర్‌దాకు చాలా దెబ్బలు తగిలాయి. తల్లోనుంచి రక్తం కారుతోంది.

అమ్మ లోపల్నుంచి బయటికి వచ్చింది. చోర్‌దా తల్లోనుంచి నెత్తురుకారటం చూసి హంగామాగా వారా వీరా అని అరవటం మొదలు పెట్టింది. పిచ్చెత్తిన దానిలా ఇంట్లోనుంచి బయటికీ, బయటినుంచి యింట్లోకీ కంగారుగా తిరుగుతోంది.

నేను ఇంత పత్తీ విశల్యకరణి (ఒక ఓషధి) తెచ్చాను. చోర్‌దా గర్జించాడు: 'దద్దమ్మా! ఆ ఆకులు నూరుకురా!'—కట్టుకట్టడం పూర్తిఅయిందో లేదో: 'మంటలు, మంటలు' అని నాలుగు మూలల నుంచీ జనం ఒక్కసారి గగ్గోలుగా అరిచారు.

ఎక్కడ ఎక్కడంటూ, అందరూ చకితులై నలుదిక్కులా కలయజూచారు మాయింటి నడికొప్పుమీద బ్రహ్మాండంగా పొగా మంటలూ కనుపించాయి. ఇల్లు నాలుగు ముఖాలా అంటుకుపోతోంది.

జనం మూగారు. కడవలతోనూ, బానలతోనూ ఎడా తెరిపీ లేకుండా నీళ్లు జారబోసుకొచ్చి మంటలతో పోరాడారు. ఒక ఝాముకు ఎల్లాగయితేనేం మంటలను అదుపులోకి తెచ్చారు గాని బూడిద తప్ప మిగిలిందేమీ లేదు

అమ్మ యేడుస్తున్నది. నాన్న కళ్లల్లో నీళ్లు తిరిగాయి. జనం వచ్చి అమ్మనీ నాన్ననీ ఓదార్చి పోతున్నారు.

'దొంగలు పడ్డయిల్లు కోలుకోదు గాని, అగ్నిదేవుడికి ఆహుతైన యిల్లు అంతకు మూడురెట్లు వృద్ధి పొందుతుంది. మరేం బెంగ బెట్టుకోకండి. ఈ యిల్లే వీటి లెక్క, అన్నీ వాసాలూ, తడికలూ. బిడ్డలున్నారు మీకేం — వాళ్లే బంగారం. ఈ పాకవున్నచోటే మళ్ళా రేపీపాటికి రాజభవనం కడతారు'—

ఏదో కవురువాసన ఆ ప్రదేశమంతా వ్యాపించుతోంది. టామీ బెంగగా అక్కడికి వచ్చింది. మొదట నాన్నగారిదగ్గిరికి వెళ్ళింది. ఆయన మౌనంగా కూర్చుని మాట్లాడలేదు. తరువాత అమ్మ దగ్గిరికొచ్చింది. ఆవిడ దానిముఖంలోకి చూసింది. దాని కళ్లల్లో ఏదో అవాచ్యమైనభాష; అమ్మకి ఏదో చెప్పటానికి ప్రయత్నించుతోంది. అమ్మ దాన్నడిగింది:

'కాజ్లీ ఏమైందో చూశావా?—అది బ్రతికి వున్నట్టేనా?'—'కాజ్లీ' మాఆవు; చూడితో వుంది. మంటలు ఆరపటానికివచ్చినవాళ్లల్లో ఎవరో దాన్ని మెడ విప్పి బయటికి తోలేశారు.

'ఇంతకీ కుక్కపిల్ల ఏదిరా అబ్బీ!' అమ్మ గుప్పున అడిగింది.

నిలువునా కంపించిపోయాను. వంటగది వరండాలో కట్టేశానన్న సంగతి ఎలెక్ట్రిక్ షాక్‌లా జ్ఞాపకం వచ్చింది.

నోటమాట రాక అలానే స్తంభించి పోయాను. వంటయింటిముందు వరండా ఒక పెద్ద బూడిదదిబ్బలా కనుపించుతోంది.

'బెల్లంకొట్టినరాయల్లే అట్టా నిల్చుంటావేంరా? నువ్వు వూడదీయకపోతే యింకెవరూడదీస్తారు? అసలు కుక్కపిల్ల దొరికిందని ఇంకెవరికి తెలుసురా!'—అన్నది అమ్మ.

లేచి చిన్న తవగాల ఒకటి తీసుకుని వంటగది వరండామీదవున్న బూడిదగుట్ట దగ్గిరికి వెళ్లింది. నెమ్మదిగా పరీక్షచేస్తూ ఆ గుట్టంతా తవ్వి యివతల పోస్తోంది.

'అరి భగవంతుడా! ఎంత పని జరిగిందీ'— ఒక్క కేక పెట్టింది.

'ఏమిటి! కాలు నరికేసుకున్నావా?' నాన్న కంగారుగా అమ్మ వేపు పరుగెత్తాడు.

ఏమి జరిగిందో నాహృదయానికి తెలిసిపోయింది. నా తల ఒక్కసారి దిమ్మెక్కిపోయింది. కళ్లు తిరిగి

పోయినై. నా రెండు కళ్ళమీదికీ చీకటి తెరలు దిగిపోయాయి. చెవులు రెండూ ఘడియలుపడి యేమీ వినిపించకుండా పోయింది.

ఒక కలగని నిద్ర మేల్కొన్నాను. ఆవరణ యావత్తూ సూర్యకాంతులు పడి ఆనందంగా వుంది. ఆ మసిబొగ్గుల గుట్టలనన్నిటినీ యెవరు ఎత్తిపోసి వుంటారు? మెరుగులు తీర్చిన పాలరాతి పలకలు పరిచినట్టుంది ఆవరణ యావత్తూ. నేను అంతసేపు నిద్రపోయినట్టనిపించలేదు.

ఇంట్లో వున్న సామానంతా కాలిపోయింది. కాని నే నిప్పుడు పడుకున్నది ఒక చక్కని మంచం; ఎవరి దిది? నా మంచం చుట్టూ ఈ టీపాయ్, ఈ బల్లలూ ఇవన్నీ ఎక్కడివి.

నేను మంచం దిగబోతున్నాను. ఇంతలో అమ్మ పరుగెత్తుకొచ్చి నన్ను ఆపివేసింది. 'దిగొద్దు నాయనా నీకు వళ్లు కులాసాగా వుంటే అంతేచాలు'—

'ఏమిటి నాకేమైంది?'—

'అదంతా తరువాత చెబుతాలే—ముందీ మందు తాగు'—

ఒక చిన్న గ్లాసు నా నోటి కందించింది. నేను తల అవతలకి లాక్కున్నా.

'ఏమిటి వెర్రి!—పిచ్చివాడవా యేమిటి?—వెధవ దిక్కుమాలిన కుక్కపిల్లకోసం ఇంత వెర్రేమిటి. భగవంతుడి దయవల్ల ఆవు బ్రతికింది. అక్కడికి ఎంతో సంతోషించాలి. ఆవు కాలిపోతే ఏమయేదో తెలుసా? మెడను పలుపు బెటుకుని 'అంభా అంభా' అని ఆవులా అరుస్తూ ఊరంతా తిరిగి ఇంటింటికాడా బిచ్చమెత్తి ఆ డబ్బుతో ప్రాయశ్చిత్తం చేసుకోవలసి వచ్చేది. బుర్ర గొరిగించుకుని గోమయం తిని ఆవు పంచితం త్రాగవలసి వచ్చేది—కాస్త మందు తాగరా అంటే గించుకుంటున్నావు!'

'మరి, నేను తగలడిపోతేనో?'—

'అవేం అవాచకపుమాటల్రా తండ్రీ?'—

'అమ్మా! కుక్కపిల్లని ఎక్కడ పారేశావూ?'—

'ఏమిట్రా నీ వెర్రి! కుక్కపిల్ల కూడా పెద్ద హంగామాగా భూస్థాపన కావడంతా జరపాలా ఏమిటి?—ఆ కాలవగట్టుమీద మర్రిచెట్టుక్రింద పారేసినట్టున్నారు.'

'ఒకసారి వెళ్లి చూసొస్తానమ్మా—ఏం? వెళ్ళరానా?'

అమ్మ ముఖం ఒక్కసారి పాలిపోయింది. మొండిగా 'అలా వల్లకాదు — డాక్టరువల్లగాదన్నాడు' అని సమాధానం చెప్పింది.

'నామనస్సేమవుతుందో ఆ డాక్టరు కేమన్నా తెలుసునా లేదా?'—

'అవునవును— తెలుసు—నాకు తెలుసు నేను నీతల్లిని'—

'ఏమిటి నీకు తెలిసింది?'—

'నీకు ఆకలేస్తోంది. నువ్వు నిన్నట్నుంచీ అన్నం తిన్లేదు'—

'అవును నిజమే—బలేగా తెలుసుకున్నావు'—

'సరే వుండు—భోజనం పట్టుకొస్తా?'—

'సరే త్వరగా తీసుకురా!'

అమ్మ వెళ్లిపోయింది. నేను పక్కమీది నుంచి దిగి, బయలుదేరాను. సరాసరి మర్రిచెట్టుదగ్గిరికెళ్ళి నాలుగువైపులా చూశాను. ప్రక్కనున్న బంజర్లో ఒకచోట రాబందులు గుంపుగా వాలివున్నయ్. వాటిమధ్యగా టామీ పడుకునుంది. ముందు కాళ్లు చాచుకుని తల ఆ కాళ్ళమధ్యకు దోపుకుని పడుకుని వుంది. పిచ్చిముండ! దిగులుగా ఏ మూలో చిస్తోందో పాపం! ఆలోచించటంగాదు. బిడ్డ శవాన్ని రాబందులు ముక్కులతో చీరకుండా హృదయంలోకి పొదువుకుని రక్షించుతోంది. తల్లిహృదయం!

నాకు చాలా ఆశ్చర్య మేసింది—మనకు మల్లే నే టామీకి కూడా మనస్సు వుంది.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ టామీదగ్గిరికి వెళ్ళాను. రెక్కలు రెపరెపలాడించుకుంటూ, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, రాబందులు కొంచెం అవతలకు జరిగినై.

పాపం పిచ్చిముండ! బిడ్డను రెండు కాళ్ళ మధ్యనూ పొదుపుకుని వుంది. దానికి మాట్లాడటానికి నోరువుంటే ఎంత ఏడిచేదో. బిడ్డా! అని అరిచి ఎంత అల్లాడేదో!

నేను ఇంకా కొంచెం దగ్గరకు వెళ్ళాను. టామీ నన్ను చూళ్లేదు. సర్దాగా ఏదో నములుతోంది.

నాకు అనుమానం వేసింది — ముందుకువంగి ఇంకా జాగ్రత్తగా పరిశీలనగా చూశాను.

ఆఁ....ఏమిటి చేస్తోంది! ... ఆ కుక్కపిల్లకాలు అప్పటికి ఒకటితినేసింది. రెండోకాలు నములుతోంది!

వెనక్కు తిరిగి వచ్చేస్తున్నాను. మధ్య దోవలోనే అమ్మ నా కెదురైంది. అమ్మ ఎంతో కోపంగా వస్తోంది. ఏదో కేక లెయ్యబోతోంది. ఇంతలో నేనే ఏదో మాట్లాడేశాను.

'వెధవటామీ — తరిమేసెయ్ — వెళ్లగొట్టెసెయ్. అది ఇక నాయింట్లో ఒక క్షణం వుండటానికి వీల్లేదు'—

నేను మాట్లాడే ప్రతిమాటా అమ్మ అతిజాగ్రత్తగా వింటోంది. జగత్తులోవున్న భ్రాంతి యావత్తూ, ఆవిడ ముఖంమీదనే తాండవించుతోంది.

'ఏమిటి నాయనా నువ్వంటున్నది!'—